ప్రజాశక్తి
ఆదివారం 29 జూన్, 2025
5
శ్రీకాకుళం



రేపు పలాసలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పలాస తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నారు. కలెక్టర్ స్వయంగా హాజరై ప్రజల వినతులు స్వీకరించనున్నారు. ప్రజలు తమ సమస్యలను మౌఖికంగా కలెక్టర్‌కు వివరించడంతో పాటు అర్జీలు కూడా సమర్పించవచ్చు. గ్రీవెన్స్‌కు హాజరు కాలేని వారు meekosam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ వినతులు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమం యథావిధిగా సాగుతుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఇదేం తీరు

- నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో సమీక్ష
- శంకుస్థాపన కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- కలెక్టరూ హాజరు కాకపోవడంతో సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు కరువు
- తూతూమంత్రంగా సాగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా సమస్యలపై చర్చించేందుకు జెడ్‌పి సర్వసభ్య సమావేశం స్థానిక ప్రజాప్రతినిధులకు ఒక వేదిక. తమ ప్రాదేశిక నియోజకవర్గాల్లో జనం పడుతున్న ఇబ్బందులను లేవనెత్తేందుకు సమావేశం ఒక ప్లాట్‌ఫారమ్. అటు ఆయన మండలాలోని ప్రజలూ తమ సమస్యలపై సమావేశంలో ఏం చర్చించారోనన్న ఆసక్తి ఉంటుంది. ఇటువంటి ప్రాధాన్యత ఉన్న సమావేశంపై ప్రజాప్రతినిధులు చులకన భావం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెనాయుడు జిల్లాలో ఉండీ సమావేశానికి డుమ్మా కొట్టారు. సమావేశానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూడా గైర్హజరు కావడంతో సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పే వారే కరువయ్యారు. మొత్తం మీద జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగానే సాగింది.

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం వాస్తవానికి ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, 11.30 గంటలకు మొదలైంది. 2.50 గంటల పాటు సాగిన సమావేశం 2.20 గంటలకు ముగిసింది. సమావేశంలో ఐదారు సబ్జెక్టులు మాత్రం చర్చించారు. ప్రభుత్వ శాఖల ప్రగతి చేపట్టిన సమీక్ష కూడా పైపైనే సాగింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు 12.30 గంటలకు వచ్చి 1.30 గంటల వరకు చర్చలో పాల్గొన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మధ్యాహ్నం 1.30 గంటలకు వచ్చి 2.20 గంటల వరకు ఉన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఒంటి గంటకు హాజరయ్యారు. మిగిలిన ప్రజా ప్రతినిధులంతా డుమ్మా కొట్టారు.

మంత్రి అచ్చెన్నాయుడు తీరుపై తీవ్ర విమర్శలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలోనే ఉండటంతో సమావేశానికి హాజరవుతారని అంతా భావించారు. ఆయన మాత్రం అదే సమయంలో నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో వంశధార, వ్యవసాయశాఖలపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఆ తర్వాత ప్రజాదర్బార్ నిర్వహించి వినతుల స్వీకరణలో పాల్గొన్నారు. ఖరీఫ్ నేపథ్యంలో విత్తనాలు, సాగునీటి సమస్యలు, సీజనల్ వ్యాధులు, పంచాయతీల్లో అపపారిశుధ్య పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆయన హాజరై ఉంటే ప్రజా సమస్యలు కొంత వరకు తీరేవి. వ్యవసాయం, వంశధారపై సమీక్షించిన ఆ సమీక్షలేవో సర్వసభ్య సమావేశంలో చర్చించి ఉంటే అందరికీ ఉపయోగపడేదని అంతా అనుకుంటున్నారు. టెక్కలి తప్ప జిల్లా ప్రజలు ప్రయోజనాలు మంత్రి అచ్చెన్నాయుడుకి అవసరం లేదా అన్న చర్చ నడుస్తోంది.

కేంద్ర మంత్రిదీ అదే తీరు

కేంద్రపౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తీరిక లేని షెడ్యూల్ కారణంగా ఒకట్రెండు సమావేశాలకు మినహా హాజరు కాలేకపోయారు. ఈ సారి జిల్లాలోనే ఉండటంతో సమావేశానికి వస్తారని అంతా ఆశించారు. ఆయన కూడా పాతపట్నం మండలం బూరగాంలో ఉద్ధానం ఫేజ్-2 శంకుస్థాపనకు హాజరయ్యారు. ఆయనతో పాటే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హాజరు కావడంతో జెడ్‌పి సమావేశానికీ ఆయన రాలేకపోయారు. దీంతో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పే వారే కరువయ్యారు.

పంచాయతీ నిధులపై సభ్యుల వాగ్వాదం

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు అంశంపై వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు ఏమీ బాగో లేవని, పనులకు బిల్లులు కూడా ఇవ్వడం లేదంటూ జెడ్‌పి వైస్‌చైర్మన్ జగన్మోహన్‌రావుతో పలువురు జెడ్‌పిటిసిలు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై డిసిసిబి చైర్మన్ సువ్వారి సత్యనారయణతో పలువురు టిడిపి సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు 2019-24 మధ్యకాలంలో కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు.

సర్పంచ్ చెక్ పవర్‌ను అనవసరంగా తొలగించొద్దు

సర్పంచ్‌ల చెక్‌పవర్‌లను అనవసరంగా తొలగిస్తే అందుకు ఉద్యోగులే తర్వాత బాధ్యత వహించాల్సి ఉంటుందని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి హెచ్చరించారు. టెక్కలి నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. టెక్కలి నియోజకవర్గానికి రూ.200 కోట్లు తెస్తామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్తున్నారని, ముందు మండల, పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధులను ఉపయోగించుకునే పని చూడాలని హితవు పలికారు.

అన్నదాత సుఖీభవపై అపోహలు తొలగించాలి

డి పట్టా భూములకు, పది సెంట్లు లోపు భూమి ఉన్నవారికి అన్నదాత సుఖీభవ రాదనే అపోహ రైతుల్లో ఉందని, దానిని తొలగించాలని జెడ్‌పిటిసి టొంపల సీతారాముడు అన్నారు. వీటితో పాటు పలు ప్రాంతాల్లో తలెత్తుతున్న విద్యుత్ సమస్యలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా, పలు ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

రూ.265 కోట్లతో

ఉద్దానం ఫేజ్-2 మంచినీటి పథకం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పాతపట్నం, కొత్తూరు, హిరమండలం

తాగునీటి సమస్య పరిష్కారానికి ఉద్దానం ఫేజ్-2 మంచినీటి పథకానికి శ్రీకారం చుడుతున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. పాతపట్నం మండలంలోని బూరగాంలో రూ.265 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న ఉద్దానం ఫేజ్-2 మంచినీటి పథకానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాతపట్నం నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తాగునీటి సమస్య పరిష్కారానికి ఈ ప్రాజెక్టు ప్రధాన పరిష్కారంగా మారనుందని తెలిపారు.

కెజిబివి అదనపు గదులకు శంకుస్థాపన

కొత్తూరు మండలంలోని వసపలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో రూ.2.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అదనపు గదులకు కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. హిరమండలం మండల కేంద్రంలో అలికాం-బత్తిలి రహదారి ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉపాధి హామీ రూ.25 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, నాణ్యత కలిగిన భవన వసతులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. ఈ గదులు విద్యార్థుల భద్రత, అభ్యాసానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. అనంతరం పశు సంవర్థకశాఖ ద్వారా రైతులకు సబ్సిడీ కింద దాణాను పంపిణీ చేశారు. నూతనంగా అమలవుతున్న కేంద్ర సబ్సిడీ పథకాలతో రైతులకు తక్కువ ధరకే పశువుల దాణా అందుబాటులోకి రానుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని చెప్పారు. రేషనలైజేషన్‌లో రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా చేసి ఉద్యోగులను కుదిరించడంతో, సేవలందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విఆర్‌ఒలు, సర్వేయర్లు కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేశారు. వినతి అందించిన వారిలో విఆర్‌ఒలు గిరీష్ కుమార్, దుర్గారావు, గోవిందరావు, సర్వేయర్లు రంజిత్ కుమార్, ఎ.తిరుపతిరావు ఉన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.బాలకృష్ణ, ఎంపిడిఒ నీరజ, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, నాయకులు మాతల గాంధీ. అగతముడి అరుణ్ కుమార్, దాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

2న వంశధార నీరు విడుదల

- శివారు భూములకూ నీరందించాలి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వంశధార కుడి, ఎడమ కాలువ ఆయకట్టు నుంచి సాగునీటిని జూలై రెండో తేదీన విడుదల చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ముందుగా రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి నిల్వలు పెంచి శివారు ప్రాంతాలకు సైతం నీరందించాలని ఆదేశించారు. మండలంలోని నిమ్మాడలో క్యాంపు కార్యాలయంలో శనివారం నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే, తక్షణమే తొలగించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి రైతులకు అవసరైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. గొట్టాబ్యారేజీలో ఇప్పటివరకు 1400 క్యూసెక్కుల నీటిని నిల్వ చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు మంత్రికి వివరించారు. అవసరమున్న ప్రాంతాల్లో తాత్కాలిక సిబ్బందిని నియమించుకుని కాలువల్లో ప్రవహిస్తున్న నీరు వృథా కాకుండా పర్యవేక్షణ చేసేందుకు అవకాశం ఉంటుందని మంత్రి సూచించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు స్వర్ణకుమార్, శేఖర్‌రావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కీర్తి చక్ర పురస్కార అవార్డు గ్రహీతకు అభినందనలు

విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన నగిరిపెంటకు చెందిన ఆర్మీ మేజర్ మల్ల రామ్‌గోపాల్ నాయుడును మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. కీర్తి చక్ర పురస్కారం తీసుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు.

ఇటీవల ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన టెక్కలికి చెందిన వర్ధమాన ఆటగాడు త్రిపురాన విజయ్‌ను మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో విజయ్ తల్లిదండ్రులు కృష్ణంరాజు, లావణ్య, వినయ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రూ.1.8 కోట్లుతో నిర్మించిన ఉప ఖజాన భవనాన్ని, రూ. 1.94.21 లక్షలు నిర్మించిన జిల్లా పరిషత్ బాలికల అనుబంధ వసతి గృహాన్ని, రూ. 9 లక్షలతో నిర్మించి సిసి రోడ్డును ప్రారంభించారు. అలాగే తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా రూ.61 లక్షలతో నిర్మాణం చేపడుతున్న అన్నాక్యాంటీన్ భవనానికి, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా రూ.60 లక్షలతో నిర్మించబోతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిణానికి, పాత పిష్ మార్కెట్ దగ్గర రూ.20 లక్షలతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిణానికి, రూ. 30 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. రూ.80 లక్షల వ్యయంతో కొత్తపేట నుంచి కోటబొమ్మాళి పెద్ద చెరువు వరకు రోడ్డుకు మధ్యలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మోహనరావు, సంచాలకులు ఖజాన, లెక్కలు, జిల్లా ట్రెజరి అధికారి సిహెచ్.రవికుమార్, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, కింజరాపు హరివరప్రసాద్, బోయిన గోవిందరాజులు, రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై పరువు నష్టం నోటీసు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి అనర్హత వివాదం రగులుతూనే ఉంది. అనర్హత అంశంపై ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మిపై స్వర్ణమణి పరువు నష్టం దావా వేయగా, తాజాగా మున్సిపల్ కమిషనర్ రమేష్‌కు లీగల్ నోటీసులు పంపించారు. అనర్హత అంశంలో అసత్యపు వార్త మీడియాకు విడుదల చేసి తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని పేర్కొంటూ రూ.12 లక్షల పరువు నష్టం లీగల్ నోటీసును న్యాయవాది ద్వారా పంపించారు. అనర్హత విషయమై జిల్లా జడ్జికి సెక్షన్ 17(3) ప్రకారం దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నా మున్సిపల్ కమిషనర్ ఆవిధంగా చేయలేదని పేర్కొన్నారు. ఏప్రిల్‌లో నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం అజెండాను తనకు పంపించలేదని చెప్పారు. అజెండా సర్వీస్ రిజిస్టరులో తన పేరు ఉండాల్సిన చోట ఖాళీగా ఉంచినట్లు తెలిపారు. సెక్షన్ 17(3) ప్రకారం జిలా జడ్జి తీర్పునిచ్చే వరకు తనకు అనర్హత వర్తించదని, తనకు అజెండా ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను రాతపూర్వకంగా కోరానన్నారు. జిల్లా జడ్జి తీర్పు వెలువడే వరకు తనకు అనర్హత వర్తించదని హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. కౌన్సిల్ ఆమోదం పొందినందున జిల్లా జడ్జికి దరఖాస్తు చెయ్యనవసరం లేదని, తాను అనర్హత పొందినట్లు తప్పుడు వార్తను ప్రచారం చేసి, తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

లింగ నిర్ధారణ వంటి చట్ట విరుద్ధ కార్యాకలాపాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సలహా కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పిసి అండ్ పిఎన్ డిటి చట్టం అమల్లో ఎటువంటి రాజీ లేకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. గర్భంలో లింగ నిర్ధారణ చేసి గర్భస్రావానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలిలని ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ నిర్వహించిన సర్వే ప్రకారం 2019-21 మధ్య వెయ్యి మందికి పురుషులకు 1163 మంది స్త్రీలు ఉన్నట్లు తెలిపారు. ఆడపిల్లలపై వివక్ష, మూఢనమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవా పథకం ద్వారా పేద ప్రజలకు సత్వరం వైద్య సేవలను అందించే విషయంలో నిర్లక్ష్యం పనికిరాదని స్పష్టం చేశారు. ఈ పథకం పథకం ఫలితాలను వంద శాతం పేదలకు అందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని, సేవాభావంతో ముందుకెళ్లాలన్నారు. ఐవిఆర్‌ఎస్ ద్వారా 387 కేసుల్లో అభిప్రాయం కోరగా 20 కేసుల్లో ప్రైవేట్ ఆస్పత్రులు డబ్బులు వసూలు చేశాయని ఫిర్యాదులు అందాయన్నారు. సమావేశంలో డిసిహెచ్‌ఎస్ కళ్యాణ్ బాబు, డిఐఒ రాందాస్, డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరే కేథరిన్, ఆర్‌బిఎస్‌కె కోఆర్డినేటర్ వెంకట్రావు, డిపిఎంఒ బి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీట్ సిస్టమ్‌ను పటిష్టంగా అమలుచేసి సస్పెక్ట్స్, రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిరంతరం నిఘా పెట్టాలని పోలీసు అధికారులను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. బీట్ సిస్టమ్ అమలు, విజిబుల్ పోలీసింగ్, సంకల్పం, నాన్ బెయిలబుల్ వారెంట్లు, ముఖ్యమైన గ్రేవ్ కేసుల దర్యాప్తు తదితర అంశాలపై శనివారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతిరోజు గ్రామాల్లో, కళాశాల, పాఠశాలలో పోలీసు అధికారులు, సిబ్బంది సందర్శించి సంకల్పం పేరిట మహిళా భద్రత, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై గ్రామీణ ప్రజలు, విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. నాన్ బెయిల్ వారెంట్స్ వీలైనంత వరకు అమలు చేసి న్యాయస్థానంలో హాజరు పరచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి నిర్దిష్ట సమయంలో కేసు అభియోగ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టి, పోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం జరగాలన్నారు. పాత నేరస్తులు, ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టిసారించి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించాలన్నారు. రాత్రివేళల్లో గస్తీ విధులు పటిష్టంగా అమలు చేసి వాహనాలు, లాడ్జీల్లో తనిఖీలు చేపట్టి ప్రాపర్టీ నేరాల నివారణకు ప్రణాళికాబద్ధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి, మద్యం అక్రమ రవాణా అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఉత్తమ ప్రతిభకు ప్రసంశా పత్రాలు

ముఖ్యమైన కేసుల్లో ప్రతిభ కనబరిచిన సిఐలు పైడిపు నాయుడు, సూర్య చంద్రమౌళి, రామారావు, శ్రీనివాస్, ఎస్ఐలు హరికృష్ణ, రాము మధుసూదన్, గోపూర్ తదితరులకు ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు వివేకానంద, అప్పారావు, ప్రసాదరావు, ఎఒ గోపీనాథ్, ఎస్‌బి సిఐ ఇమ్మాన్యుల్ రాజు, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక సంకేతాలను గుర్తించారా?



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వ పెద్దలకు ప్రజల్లో వ్యతిరేకత ఉన్నట్లు సంకేతాలు ఉన్నట్లు గుర్తించినట్లు ఉంది. ప్రజల్లో అది మరింత పెరగకుండా జాగ్రత్త పడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తగినంతగా ప్రచారం రావడం లేదని కూటమి నేతలు తెగ బాధపడిపోతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో ఇంటింటికీ ఎమ్మెల్యేలను పంపి అసంతృప్తి తగ్గించుకునే పనిచేయాలని భావిస్తోంది. ఇప్పటికే వైసిపి ప్రభుత్వంపై ముప్పేట దాడి చేస్తోంది. రకరకాల కార్యక్రమాలతో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రజల్లోకి రావడం ప్రారంభించారు. అటు వైసిపి శ్రేణులూ యాక్టివేట్ అయ్యాయి. పార్టీ ఇటీవల నిర్వహించిన వెన్నుపోటు దినం, యువత పోరు నిరసన ర్యాలీతో ప్రభుత్వంపై వైసిపి దాడిని తీవ్రతరం చేసింది. అంతా బాగుందని కూటమి నేతలు బయటకు చెప్తున్నా, లోలోపల ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి వారిని వెంటాడుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒకట్రెండు అమలు చేసినా పూర్తిస్థాయిలో వాటిని నెరవేర్చలేదు. ప్రతి జనవరిలో జాబ్ కేలండర్, నిరుద్యోగ భృతి తదితర హామీలతో పాటు పలు తరగతులకు ఇచ్చిన హామీల్లో వేటినీ నెరవేర్చలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత డిఎస్‌సి మినహా ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదు. పైగా కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన వారిని ఇంటికి సాగనంపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వందలాది మందిని తొలగించింది. రేషన్ వాహనాల్లో పనిచేస్తున్న వారినీ తీసేసింది. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను తీసేయ్యమని, రూ.10 వేలు ఇస్తామని వారికి హామీ ఇచ్చిన ప్రభుత్వం వారినీ తొలగించింది. దీంతో వేలాది కుటుంబాలకు ఉపాధి పోయింది. అర్ధాంతరంగా ఉపాధి కోల్పోవడంతో వారంతా రోడ్డున పడ్డారు. ఇప్పటికే అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన పథకానికి చెందిన కార్మికులు ఒక్కొక్కరుగా రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, వారిపై పలురూపాల్లో భారాలు మోపింది. ప్యూయల్ అండ్ పవర్ పర్చేజి కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) పేరుతో గతేడాది డిసెంబరు నుంచి ప్రజల నుంచి వసూలు చేయడం ప్రారంభించింది. పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారికి సైతం భారీగా కరెంట్ బిల్లులు వచ్చాయి. ప్రజల్లో ఒకవైపు అసంతృప్తి ఉంటే ప్రభుత్వం మాత్రం తమది సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పుకుంటోంది. అభివృద్ధిపరంగా ఏడాది కాలంలో ఏమైనా చేశారా అంటే అదీ లేదు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2, ఆఫ్‌షోర్ రిజర్వాయర్, వంశధార-నాగావళి నదులను అనుసంధానం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి వంశధార ప్రాజెక్టుకు సంబంధించి 87 ప్యాకేజీ పనులు 80 శాతం, 88 ప్యాకేజి పనులు 95 శాతం పనులు పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. స్వల్ప శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్న వీటిని ఏడాదిలోపే పూర్తి చేసి రైతులకు సాగు నీరందించే అవకాశం ఉన్నా కూటమి ప్రభుత్వం ఆ పని చేయలేకపోయింది. వంశధార-నాగావళి అనుసంధాన పనులు 73 శాతం పూర్తి కాగా, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా పనుల్లో పెద్దగా పురోగతి లేదు. గతేడాది ఎన్నికల సమయానికి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 45 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఇప్పటికీ అదే పరిస్థితి ఉంది. సాగునీటి ప్రాజెక్టులు పరిస్థితి ఇలా ఉండగా, పారిశ్రామికంగానూ ఏమాత్రం పురోగతి కనిపించడం లేదు. ఏడాది కాలంలో ఒక్క పరిశ్రమకూ శంకుస్థాపన చేసిన దాఖాలావు లేవు.

అభివృద్ధి, సంక్షేమం పరంగా ప్రజల ఆకాంక్షలను అందుకోలేని పక్షంలో ఏ ప్రభుత్వంపైనైనా అసంతృప్తి వ్యక్తం కావడం సహజం. టిడిపి కూటమి ప్రభుత్వం అందుకు అతీతమేమీ కాదు. ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని కప్పిపుచ్చుకునేందుకు సుపరిపాలన పేరుతో అంతా బాగుందని తమకు తామే కితాబిచ్చుకుంటే దాని ఫలితం ఎలా ఉంటుందో టిడిపి నేతలకు తెలియందేమీ కాదు. ప్రజలకు ఇచ్చిన హామీలను అటకెక్కించి అమరావతి, పోలవరం అంటూ జపం చేసిన చంద్రబాబును 2019 ఎన్నికల్లో ప్రజలు ఎలా తిరస్కరించారో చూశాం. మనకు వైకుంఠపాళి వద్దంటూ పార్టీ శ్రేణులకు చెప్తున్నా, అది బాబు చేతిలో లేదు. కూటమి ప్రభుత్వం అమలు చేసే విధానాలపైనే ఆధారపడి ఉంది. 2014-19 మాదిరి విధానాలను అనుసరిస్తే, ఆ సుపరిపాలనకు 2019లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఎలా ఉంటుందో బాబుకు, పార్టీ నేతలకు తెలియందేమీ కాదు. కూటమి పాలనలో ఇప్పటికే సంవత్సరం గడిచిపోయింది. మిగిలిన నాలుగేళ్లయినా ప్రజలకు మేలు చేసే విధానాలను అమలు చేస్తుందని ఆశిద్దాం.



ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

మహిళా ఆర్థిక ప్రగతే లక్ష్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని, మహిళలను అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయం సహాయ సంఘాల మహిళలు ప్రభుత్వం అందజేస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకొని, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. మహిళల్లో ఆర్థిక ప్రగతికి వృత్తివిద్యలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గృహలక్ష్మికుల రాష్ట్రపేదరిక నిర్మూలన సంస్థ అందజేసిన ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపిపి మాజీ చైర్మన్ తోటయ్యదొర తదితరులు

గిరిజన సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- లావేరు

ధర్తి ఆబాజన్ భగిదరి అభియాన్ కార్యక్రమం ద్వారా గిరిజన సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందని ఐటిడిఎ ప్రత్యేక అధికారి జాలాట్ దయానంద్ అన్నారు. శనివారం లావేరు గ్రామ పంచాయతీ జిజి వలస గిరిజన గ్రామంలో జాన్ జాతీయ గౌరవ్ వర్ష్ వేడుకల్లో భాగంగా ధర్తి ఆదిజన్ భగిదరి అభియాన్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింట సర్వేలో వ్యక్తిగత సామాజిక అవసరాలను గుర్తించి ఆ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమం చేపట్టడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా వ్యక్తిగత సామాజిక అవసరాలను పరిష్కరించబడుతుందని, ఇందులో భాగంగా ఆధార్ సమస్యలు పరిష్కారం కోసం ఆధార్ కేంద్రం, వైద్య శిబిరం, పశు వైద్యశిబిరం, ఆదాయ, నివాస, కుల తదితర ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటరావు, ఎన్నై ఎంపిసి మాజీ చైర్మన్ యునసపల్లి తోటయ్యదొర, సర్పంచ్ ఉద్దాపు లక్ష్మి ఎంపిటిసి యునసపల్లి సతీష్, డి.రాధ, మండల అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దిలీప్‌కుమార్

బోరు ఏర్పాటుకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా పోటీ చేసిన వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ ఇచ్చిన మాట ప్రకారం రజక సంఘం భవనానికి కొత్తగా బోర వెల్ ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్ధేశ్వర రజక సంఘానికి హామీనిచ్చారు. ఈ హామీ మేరకు సొంత డబ్బులు వెచ్చించి సంఘం భవనానికి బోర్ వెల్ ఏర్పాటు చేశారు. దీంతో పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు కస్పా పాపారావు, దినేష్, జగ్గారావు, జగన్, సూర్యనారాయణ, దాలయ్య, వెంకటరావు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు బాలరాజు మృతి

ప్రజాశక్తి - నందిగాం

శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలంలోని ప్రతాప విశ్వనాథపురానికి చెందిన సిపిఎం నాయకులు కవిటి బాలరాజు (74) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. బాలరాజు తొమ్మిదో తరగతి చదువుతున్న రోజుల్లోనే కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. 1985లో డివైఎఫ్ఐలో చేరి అదే ఏడాది జిల్లాస్థాయి శిక్షణా తరగతులు ప్రతాప విశ్వనాథపురంలో నిర్వహించారు. యువజన సంఘం సభ్యునిగా ఉద్దానంలో అన్ని గ్రామాల్లో పర్యటించారు. సిపిఎంలో చేరిన ఆయన తాగునీటి సమస్యలపై యువజనులను సమీకరించి అనేక పోరాటాలు నిర్వహించారు. ఉద్దానం తాగునీటి పథకం సాధనలో ఆయన పాత్ర కీలకం. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా సుదీర్ఘ కాలంపాటు పనిచేసి వంశధార చివర భూములకు సాగునీరు, గిట్టుబాటు ధరపై పోరాటాల్లో భాగస్వామ్య మయ్యారు. భవన నిర్మాణ కార్మికులు, ఉప్పు కార్మికులు, ఆటో, ట్రాక్టర్ కార్మికుల సమస్యలపై విశేష కృషి చేశారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ పర్యటన సందర్భంగా దళితుల



భౌతికకాయానికి నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు, ఇన్‌సెట్‌లో బాలరాజు (ఫైల్)

సమస్యలపై అధ్యయనం చేసి నివేదిక తయారీలో సహాయ సహకారాలు అందించారు. గ్రామాల్లో శాఖలు ఏర్పాటు చేసి పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. ఆయనకు భార్య శంకుంతల, ముగ్గురు కుమారులు ఉన్నారు.

సిపిఎం నాయకుల సంతాపం

బాలరాజు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు బి.కృష్ణమూర్తి, కె.మోహనరావు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మండలంలోని పి.విపురంలో బాలరాజు భౌతికకాయంపై పార్టీ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలరాజు రైతాంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. గిట్టుబాటు ధరలు, శివారు భూములకు సాగునీరందించేందుకు పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, పాలిన సాంబమూర్తి, హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు, తెప్పల అజయ్ కుమార్, ఎన్.గణపతి, నెయ్యల మోహనరావు, బి.రామకృష్ణ, ఎన్.భైరాగి, ఎన్.సింహాచలం, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు వేలంపాట

టెక్కలి రూరల్ : టెక్కలి ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఈ నెల 30న ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ మీరా సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాన్ని శ్రీకాకుళం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యాన వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రూ.వెయ్యి చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. పాటలో వాహనం కొనుగోలుదారుడు పాట ధరకు 18 శాతం జిఎస్‌టి అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల ర్యాలీ

పలాస: తమ సమస్యలు పరిష్కారానికి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న నిరసన భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీ విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, కె.వెంకట్ మాట్లాడుతూ బకాయి పడిన పిఎఫ్ డబ్బులను కార్మికులకు చెల్లించాలన్నారు. మృతి చెందిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. పనిముట్లు సరఫరా చేయాలన్నారు. కోవిడ్‌లో పనిచేసిన కార్మికులకు 14 నెలల బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.కూర్మారావు, ఎం.రవి, పి.బాలకృష్ణ, కె.ఈశ్వరరావు, ఎన్.తిరుపతి, ఢిల్లీ, ప్రకాష్ ముఖి, ఎన్.శంకర్, ఎస్.లక్ష్మి, ఉషా, గులాబీ ఎస్.రమేష్ పాల్గొన్నారు.

ఎడిఎగా వెంకట మధు

నరసన్నపేట: నరసన్నపేట వ్యవసాయ శాఖ ఎడిఎగా ఎల్.వెంకట మధు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆధునిక వ్యవసాయము, యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలన్నారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

ప్రజాశక్తి- పోలాకి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండలం మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు అంతమందికి రూ.15 వేలు చొప్పున ఆర్థికసాయం అందించామని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించడానికి సెమిస్టర్ విధానంలో పంపిణీ చేస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో సన్న బియ్యం వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. డ్రాపావుట్లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకట



విద్యా కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ప్పలనాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భైరి భాస్కరరావు, కాయ రవి, ధర్మాన అమ్మనాయుడు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నమని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులను స్వీకరించారు. అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ప్రశ్నిస్తున్న వైస్ చైర్మన్ సురేష్‌బాబు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ పరిధిలో మూడు రోజుల నుంచి చేపడుతున్న పారిశుధ్య కార్మికులు సమ్మెతో ముగురు కూపంగా మారుతుందని, తక్షణమే పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కోరారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం సాధారణ సమావేశం నిర్వహించారు. సంతోష్ లేవనెత్తిన అంశంపై చైర్మన్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సమస్య గత పదేళ్ల నుంచి ఉందని అన్నారు. కార్మికులు బకాయిలు, పిఎఫ్ డబ్బులు సుమారు వంద మంది కార్మికులకు సంబంధించి రూ.40 లక్షలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. దీనిపై కమిషనర్, పిఎఫ్ అధికారులతో మాట్లాడి పారిశుధ్య కార్మికులకు డబ్బులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులతో చర్చించి ఒకటి. రెండు రోజుల్లో కార్మికులు సమస్య పరిష్కరిస్తామని, లేదంటే ప్రత్యక్షయ మార్గంలో పారిశుధ్య పనులు చేపడతామని తెలిపారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో 1760 మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని అన్నారు. కెటి రోడ్డు మధ్యలో, పార్కులు, విశాలమైన వీధుల్లో మెక్కలు నాటి సంరక్షించాలన్నారు. కౌన్సిలర్ జోగ త్రివేణి మాట్లాడుతూ ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు మంజూరైనా టెండర్లు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. దీనికి డిఇ కనకరాజు సమాధానం చెబుతూ అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామన్నారు. కౌన్సిలర్ కర్రి మాధవరావు మాట్లాడుతూ కాశీబుగ్గ పెంట్రోల్ బంక్ నుంచి తాళభద్ర రోడ్డు గతంలో మంజూరైనా పనులు నిలిచిపోయాయని అన్నారు. దీంతో ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ సమాధానం చెబుతూ ఆ రహదారి ఆర్అండ్‌బి అధికారులతో మాట్లాడి పనులు చేపట్టేవిధంగా చూస్తామన్నారు. వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు మాట్లాడుతూ ఇందిరా కానీలో నీటి సరఫరా పనులు కోసం నిధులు కేటాయిస్తూ అజెండాలో చేర్చారని, ఆ పనులు చేయమని ఎవరు చెప్పారో తనకు సమాధానం ఇవ్వాలన్నారు. నామినేట్ పనులు కాకుండా టెండర్లు పిలిచి పనులు చేపట్టేలా చూడాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, డిక్కల ఆనంద్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

మీడియాపై దాడులకు నిరసన

టెక్కలి రూరల్ : హైదరాబాద్‌లో మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కూన సుదర్శనరావు ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. టెక్కలి అంబేద్కర్ కూడలి వద్ద ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. మీడియా కార్యాలయాలపై దాడులు ఖండించాలి, మీడియా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బగాది వాసుదేవరావు, సుంకు గోపినాథ్, మార్పు పద్మలోచనరావు, ఎల్.రమణ, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ఆక్రమణల తొలగింపు

టెక్కలి: టెక్కలి గోపినాథపురం చెరువుకు నీరు అందించే వంశధార పిల్ల కాలువ ఆక్రమణల పనులను శనివారం ప్రారంభించారు. వంశధార ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువ ద్వారా ప్రవహించే సాగునీటి కాలువపై రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించారు. దీంతో గోపినాథపురం ప్రాంతానికి చెందిన రైతులు టెక్కలి ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. దీంతో వంశధార ఇఇ శేఖర్ ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి యంత్రాల ద్వారా కాలువ ఆక్రమణలను తొలగించారు. త్వరితగతిన పూర్తి చేసి సాగునీరు ప్రవహానికి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



సన్మానిస్తున్న గ్రామస్తులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

నౌపడ : సంతబొమ్మాళి మండలం కోటపాడు ప్రాథమిక పాఠశాల నుంచిఉపాధ్యాయులు పంగ జనార్ధన్, అన్నెపు దేవికలు ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ మేరకు సర్పంచ్ కోత ఇందిర ఆధ్వర్యాన పాఠశాల ఆవరణలో శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో గత తొమ్మిదేళ్లుగా వారు అందించిన సేవలు, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి మర్చిపోలేమన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి సతీష్, కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు పాత మధుసూదనరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కోత ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, పాఠశాల హెచ్ ఎం దశరథరావు, ఉపాధ్యాయుల జ్యోతి పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ రేణుక

నరసన్నపేట: మండలంలోని పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని డిప్యూటీ ఎంపిడిఒ రేణుక సూచించారు. మండలంలోని దూకలపాడు పంచాయతీలో చెత్త సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరు చేయాలని, వాటిని వర్మీకంపోస్టుకు తరలించాలని ఆదేశించారు. తద్వారా వ్యవసాయ భూములకు ఎరువుగా ఉపయోగించేలా అవగాహన కల్పించారు. సర్పంచ్ అల్లు అసిరినాయిడు, సిబ్బంది పాల్గొన్నారు.

భూమి కోసం వివాదం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఉదయపురం పరిధిలో ఉన్న సర్వే నంబరు 198/1లో గల 60 సెంట్లు భూమి కోసం పలాసకు చెందిన ఇరు కుటుంబీకుల మధ్య వివాదం చోటు చేసుకుంటుంది. ఈ భూమి సమీపంలో రాజాం సురేష్ కుటుంబీకులకు 61 సెంట్లు భూమి తమకు ఉందని తన తండ్రి కామరాజుకు గడ్డెవు గరికమ్మ వీలునామా రిజిస్ట్రేషన్ ఉందని శనివారం వాదిస్తున్నారు. ఇటీవల వర్షాలు కురియడంతో సురేష్ ఆ భూమిలో విత్తనాలు జల్లేందుకు వెళ్లగా వీరన్నపాత్రో కుటుంబీకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్యం వివాదం ముదరడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ భూమి వివాదంపై విఆర్ఒ సర్వేయరు కూడా పరిశీలించారు. అయితే అప్పటికే ఈ భూమి వివాదం కోర్టులో ఉండడంతో వారు ఎటువంటి నివేదికలు ఇవ్వలేదు.



దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

ఎన్ని రోజులు ఇలా...?

కవిటి: ఏ పిల్లవాడు చదువుకు రంగుల కలలతో పుస్తకం తెరిచినా మొదటి అడుగు అడగాల్సింది జన్మ ధ్రువీకరణ పత్రం నుంచే. అది లేకపోతే అతని కల, అతని శ్రద్ధ, అతని జీవితం అన్నీ అడుగడుగునా అడ్డు పడతాయి. అలాంటి పిల్లల కోసం తమ భవిష్యత్‌ను తలచుకుని, తమ బాధను ఒడిసిపట్టి బెంతు ఒరియాలు 549 రోజులుగా మౌన దీక్ష చేస్తున్నారు. కవిటి బస్టాండ్ వద్ద జరుగుతున్న ఈ నిరాహార దీక్షలు ఒక చలికాలపు రాత్రిలా నిశ్శబ్దంగా ఉన్నా వాటి వెనక ఉన్న బాధ ఒక అగ్నిపర్వతం లాంటిది. వారు అడిగేది ఒక్కటే కుల, జన్మ, ప్రాంత ధ్రువీకరణ పత్రాల జారీ. అది లేకపోవడంతో వారి పిల్లలకు స్కాలర్‌షిప్ లేదు, రిజర్వేషన్లు లేవు, ఉద్యోగావకాశాలు శూన్యం. ఇలాంటి పరిస్థితుల్లో శనివారం దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియా యువజన సంఘం అధ్యక్షుడు సుమన్ బిసాయి మాట్లాడుతూ పిల్లలకు మనం పెట్టే పేరుతోనే పిలుస్తారు కానీ, రెవెన్యూ సిబ్బంది తీరు మా పిల్లల ఉనికినే తిరస్కరిస్తోంది. రెవెన్యూ శాఖ తీరుతో మా విద్యార్థులు కొంతమంది చదువు మానేశారు, మరి కొంతమంది ఉపాధి కోల్పోయారు. ఇప్పటికైనా మా సమస్యలకు పరిష్కారం దొరక్కపోతే పోరు ఉధృతం చేయడం తప్ప మాకు వేరే దారి లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో దూదిస్టీ మజ్జి, మోహన్ సాహు, బృందావన్ బిసాయి, కాళీ సాహు, మోహన్ పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని వినతి

బూర్జ: మండలంలోని కె.కె.రాజపురం పరిధిలో ఉన్న బద్దె చెరువు ఆక్రమణకు గురికావడంతో సాగునీరు అందక పంటలను నష్టపోతున్నామని, చర్యలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్ పద్మావతికి గ్రామ రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఉన్న సర్వేనెంబర్ 72లో 57.29 సెంట్లు కొందరు వ్యక్తులు చెరువు గర్భాన్ని మట్టితో కప్పేసి పొలాలుగా మార్చేస్తున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. మరి కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. దీనివలన సాగునీటి నిల్వల సామర్థ్యం తగ్గిపోతుందని, ఫలితంగా పంటలకు సాగునీరు అందక తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా



ఆక్రమణకు గురైన బద్దె చెరువు

పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టి తమ పంటలకు సకాలంలో సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పద్మావతికి రైతులు వినతిపత్రం అందించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న తవిటినాయుడు

పంట సాగు విధానాలు మారాలి

లావేరు: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. శనివారం వాళ్లేపేటలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా వాళ్లే జగదీశ్వరరావు పొలంలో సాగవుతున్న వరిసాగు క్షేత్రాలను ఆయన సందర్శించారు. వాతావరణంలో మార్పులతో జూలైలో వస్తున్న అవసరమైన వర్షాలు పడకపోవడం రైతన్నల్లో ఆందోళన కలిగిస్తుందన్నారు. రైతులు ముందస్తుగా మేల్కొని వేసవి దుక్కులు పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆరుతడి విధానాలైన ఎరువు, విత్తనం ఒకేసారి వేసే యంత్రాన్ని ఉపయోగించి వరిసాగు చేయడం అన్ని విధాల లాభదాయకమన్నారు. దీనివలన విత్తనాల ఆదాతో పాటు కూలీల ఖర్చు కూడా ఆదా అవుతుందన్నారు. మండల సమన్వయకర్తలు జగ్గు రోతు గోపాల్, వైశ్యరాజుల వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

అక్షర కృషీవలుడు ఉపేంద్రుడు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



ఉపేంద్రరావు

విద్యార్థుల భవిష్యత్‌ను మార్చే గొప్ప శక్తి ఉపాధ్యాయ వృత్తితోనే సాధ్యమవుతుందని, నిర్విరామంగా 36 ఏళ్లపాటు తన ఉపాధ్యాయ జీవితాన్ని కొనసాగిస్తూ ఎంతో మంది శిష్యులను సంపదగా పొంది ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేస్తున్న మూల ఉపేంద్రరావు ప్రస్థానం 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి పంచాయతీ పూండి గల్లీలో మూల సాయమ్మ, కరువవాడు దంపతుల ముగ్గురు అక్కచెల్లెళ్లు తోడ పుట్టిన మూడువ సంతానమే ఈ అక్షర కుశీవలుడు ఉపేంద్రుడు. వ్యవసాయ కుటుం బం నుంచి వచ్చిన ఉన్నత విద్యావంతుడుగా తన భాధ్యత ఎరిగి నిగర్విగా తన ప్రయాణం బోధన రంగంలో శిఖరాగ్రం చేరింది.

విద్యాభ్యాసం

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు శివరాంపురంలో, ఆరు నుంచి పదో తరగతి నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కాశీబుగ్గ ఎస్‌బిఎస్‌వైఎం కళాశాల పూర్తి చేశారు. అనంతరం ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ పొందారు. విజయనగరం మహారాజా కళాశాలలో బిఎడ్ పూర్తి చేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీ నుంచి ఆంగ్లంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పట్టా సాధించారు.

ఉద్యోగ నేపథ్యం

1989 డిఎస్‌సిలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా తన ప్రస్థానం ప్రారంభించారు. టెక్కలి మండలం జెండాపేటలో మొట్టమొదటి సారిగా ఉపాధ్యాయ విధులు నిర్వహించారు. అనంతరం పల్లిసారథి, డోకులపాడు, తన స్వగ్రామమైన పూండి గల్లీలో సుదీర్ఘ కాలం బోధన సేవలు అందించారు. ఉద్యోగోన్నతిపై సాంఘికశాస్త్ర సహాయకునిగా వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ 2019లో బదిలీపై అమలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వచ్చి సేవలు అందిస్తున్నారు. చిన్నతనం నుంచే చదువు ప్రాముఖ్యతను గ్రహించి అభ్యుదయ భావాల్ని రంగరించుకుని ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాల్లో చురుగ్గా నాయకత్వ పాత్ర పోషించారు. వజ్రపుకొత్తూరు మండలం యుటిఎఫ్ గౌరవాధ్యక్షునిగా చాలా కాలం పాటు తన అమూల్యమైన సేవలను అందించారు.

సేవలకు గుర్తింపు

విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వం వికాసానికి నిబద్ధతతో చేస్తున్న కషిని విద్యా సేకా అధికారులు ప్రభుత్వం గుర్తించి 2017లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇచ్చి సత్కరించారు. 2015-16 విద్యా సంవత్సరానికి విశాఖపట్నంకు చెందిన మదర్ థెరిస్సా స్వచ్ఛంద సంస్థ నుంచి గురుబ్రాహ్మ రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు.

కుటుంబ నేపథ్యం

ముడువ సంతానమైన ఉపేంద్రరావుకు మమతతో వివాహమైంది. వీరికి పెద్ద కుమారుడైన అభిషేక్ సొంత పంచాయతీ నగరంపల్లిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండో కుమారుడు అజిత్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నాడు.

సామాజిక సేవలో తనదైన ముద్ర

విద్యారంగంలో తనదైన ముద్ర వేసుకుంటూ సామాజిక సేవారంగంలో ప్రముఖ పాత్ర పోషించారు. తన గ్రామంలో తాను పనిచేసిన ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణంలో, నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.ఐదు లక్షల విలువచేసే కళావేదిక నిర్మాణాలకు విరాళాలు ఇచ్చి గ్రామస్తులు స్నేహితులు సహకారంతో వాటిని పూర్తి చేసే బాధ్యత తీసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దానన్న సంతృప్తి

ప్రజాశక్తి- బూర్జ

కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి తన వద్ద చదువుకున్న విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దానన్న సంతృప్తి కలిగిందని మండలంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు తెలిపారు. ఈనెల 30న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వజ్రపుకొత్తూరు మండలం శారదాపురంలో వాసుదేవరావు, భానుమతి దంపతులకు మొదటి సంతానంగా 4-6-1965న ఆయన జన్మించారు. ఆయన తండ్రి వాసుదేవరావు ఉన్నత చదువులు చదివినప్పటికీ వ్యవసాయంపై మక్కువతో గ్రామంలో వ్యవసాయం చేసేవారు.

విద్యాభ్యాసం

నందిగామ మండలం హరిదాసుపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వరకు, 6 నుంచి పదో తరగతి వరకు చిన్నబడాం ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్, ఇంటర్మీడియట్ పలాస ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కృష్ణా డిగ్రీ కాలేజీ వైజాగ్‌లో డిగ్రీ, ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ, విజయనగరం ఎంఆర్ కాలేజీలో బిఇడి చేశారు.

ఉద్యోగ జీవితం

1990లో నక్కపల్లి గురుకుల పాఠశాలలో ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. అదే ఏడాది గుడిగొండ గురుకుల పాఠశాలలోను, ఆ తర్వాత మూడేళ్లు విజయనగరం జిల్లా



దేవేంద్రరావు దంపతులు

బాడంగిలో 1993 వరకు, 93 నుంచి 94 వరకు ఎచ్చెర్ల కాలేజీలో, 94 నుంచి 95 కృష్ణాపురం గురుకుల పాఠశాలలో, 95లో కంచిలి గురుకుల పాఠశాలలో పనిచేస్తూ అదే ఏడాది దుప్పలవలసలో జెఎల్‌గా పదోన్నతి పొందడమే కాకుండా 2002 వరకు పని చేశారు. అలాగే కొల్లివలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మూడుసార్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు. 2013-18 వరకు కొల్లివలస గురుకుల పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2018 నుంచి 24 వరకు దుప్పల వలస గురుకుల పాఠశాలలో పదోన్నతి పొంది ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కొల్లివలస అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వరించిన అవార్డులు

మంచి ఫలితాలు సాధించినందుకు, ఉత్తమ సేవలు అందజేసినందుకు 2016లో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. 2024లో రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. అలాగే ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అప్పటిమంత్రి కళావెంకటరావు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అప్పటి మంత్రి రెజియా నాయక్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

సంతృప్తినిచ్చే అంశం

తన విధి నిర్వహణలో వేల మంది విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంతో ఎంతోమంది విద్యార్థులు ఉన్నతస్థాయి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

కుటుంబ నేపథ్యం

1990లో సుజాతతో వివాహంకాగా కుమారుడు రామ్ స్వరూప్, కుమార్తె జ్యోత్స్న ఉన్నారు. వీరిద్దరు వైద్యులు.

శేష జీవితం

తన శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా ప్రశాంతంగా గడుపుతాను. విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. తన సేవలు అవసరమైతే ఎల్లవేళలా అందిస్తాను. నా ఉద్యోగ ప్రయాణంలో నాకు అండగా ఉండి సహాయ సహకారాలు అందించిన కుటుంబసభ్యులకు, సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రంగస్థల కళాకారులకు ప్రభుత్వ అండ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రంగస్థల కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ భరోసానిచ్చారు. స్థానిక ఎస్‌పి బంగ్లా సమీపంలో శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి నాటక, సినీ రంగాల్లో అనేక మంది రాణిస్తున్నారని తెలిపారు. జిల్లా కళలకు పుట్టినిల్లుగా అభివర్ణించారు. కళాకారులు, క్రీడాకారుల వల్ల జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు లభిస్తాయన్నారు. శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్యకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఇండోర్ స్టేడియం ఉండాలనే అంశాన్ని పరిశీలించామని, అందుకు ఇదివరకే ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, రామచంద్ర దేవ్, టిడిపి నాయకులు పి.ఎం.జె బాబు, చిట్టి నాగభూషణం, రమణారావు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగం మూలాలను సమూలంగా నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందని డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు విమర్శించారు. ఎఐసిసి పిలుపు మేరకు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ నగరంలోని పాతబస్టాండ్ కూడలి వద్ద సంవిధాన్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవస్థలపై ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వంచన చేస్తోందని దుయ్యబట్టారు. ఉచిత ఇసుక పాలసీ పేరుతో ఇసుక అక్రమ రవాణా సాగుతోందన్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి, నాయకులు ఇజ్జురోతు రమణ, మామిడి సత్యనారాయణ, బొత్స వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పాతర్లపల్లికి చెందిన మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈయనతో జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జెడ్‌పిటిసి మీసాల సీతం నాయుడు ఉన్నారు.

బూర్జ: మండలంలోని సింగన్నపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి గేదెల ముఖలింగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం ముఖలింగం కుటుంబసభ్యులతో పాటు కొరగాం గ్రామానికి చెందిన దేవర సూర్యారావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

రామ్మోహనరావు పరామర్శ

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్‌ల మాతృమూర్తి ప్రేమకుమారి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న డాక్టర్ కెల్లి రామ్మోహనరావు, టెంకాల గుర్తలు పరామర్శించి ఓదార్చారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే పలువురు నాయకుడు బోయిన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.


పరామర్శిస్తున్న రామ్మోహనరావు

ర్యాంకర్లకు అభినందనలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ చదివి పిజిలో బోటనీ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకును తియల హారిక సొంతం చేసుకుంది. దీంతో కళాశాల ఆవరణలో శనివారం హారికను అభినందించారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపునకు కృషి చేసిన హరిక విజయాన్ని, బోటనీ అధ్యాపకులు డి.వాసుబాబుని అభినందించారు. అదేవిధంగా తమ కళాశాలకు చెందిన ఎస్.రుక్మిణి పిజి ప్రవేశ పవేశ పరీక్షల్లో ప్రతిభకనబర్చిన ఆమెను అభినంది ంచారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్ పాల్గొన్నారు.


టెక్కలి : హారికను అభినందిస్తున్న అధ్యాపకులు


నరసన్నపేట : గాయత్రిని సన్మానిస్తున్న అధ్యాపకులు

నరసన్నపేట : ఇటీవల విడుదలపై పిజి ఎంట్రాన్స్ పరీక్షలో ఎంఎల్ఆర్ నాయుడు కళాశాల విద్యార్థిని రావాడ గాయత్రి రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించింది. ఈ మేరకు ఎంఎల్ఆర్ నాయుడు విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ముద్దాడ బాల భూపాల నాయుడు, ప్రిన్సిపాల్ తర్ర సత్యదాస్‌లు కళాశాల ఆవరణలో శనివారం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుపై ఉన్న అంకితభావం, కష్టపడే మనస్తత్వం పోటీ పరీక్షల్లో ఉన్నత స్థాయిలో నిలబెడతాయని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వి.ప్రసాద్, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, శివ, సురేష్ సాహూ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి- పలాస

మహిళలు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని, పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ కె.వసంత కుమార్ అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సర్పంచ్‌లకు మహిళా సాధికారతో స్వపరిపాలన సాధ్యంపై నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణలో చెబుతున్న మెలకువలు తెలుసుకొని పంచాయతీ పాలనపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తుందని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని


అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ వసంతకుమార్

కోరారు. అనంతరం డిఆర్‌పిలు జ్యోతిశ్రీనివాస్, కామరాజు, ఎన్.మన్మథరావులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఎఒ అనురాధ, సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ పేరాడ ఆనందరావు పాల్గొన్నారు.


సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

రాజు దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని డి.గొనపపుట్టుగ పంచాయతీ పరిధిలోని వడ్డి జల్లుపుట్టుగ కాలనీ సమస్యలను స్థానికులు జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ పెద్దలు, యువత, స్థానిక ప్రజలు కలిసి రెండు ప్రధాన సమస్యలపై శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కేవలం ఒక వీధికే తాగునీటి సదుపాయం కల్పిస్తే... మిగిలిన వీధికి తాగునీటి సమస్య తీవ్రమైందని తెలిపారు. దీంతో కాలనీ మొత్తం నీటి కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాజుకు వివరించారు. అలాగే కాలనీలో పిచ్చిమొక్కలు విస్తరించి వర్షాకాలంలో నీరు నిలిచిపోయి రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని, పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీధుల్లో సిసి రోడ్లు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాజు హామీనిచ్చారు.

చిన్నారికి అండ

కవిటి: మండలంలోని తిప్పనపుట్టగకు చెందిన పురుషోత్తం మజ్జి కుమారుడు హైడ్రోసెఫలస్ అనే అరుదైన మెదడు వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు నెలల వయసులోనే ఈ వ్యాధి బారిన పడిన ఈ చిన్నారికి శస్త్రచికిత్స అవసరమైంది. తిరుపతిలో వైద్యం కోసం తీసుకెళ్లినా వయసు తగ్గిన కారణంగా డాక్టర్లు ఆపరేషన్‌ను వాయిదా వేశారు. అప్పటి నుంచి మందులతో చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం చిన్నారి శస్త్రచికిత్సకు సమయం దగ్గర పడటంతో కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో పడింది. ఈ విషయాన్ని గ్రామ యువత స్పెషల్ గైస్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఫౌండేషన్


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

సభ్యులు రూ.15 వేలు తక్షణ సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువత సేవా కార్యక్రమాల్లో చొరవ చూపుతున్న ఎస్‌జిఎఫ్ సభ్యులను అభినందించారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి


గొర్రెలకు మందులు వేస్తున్న పశువైద్యులు

కోటబొమ్మాళి: ప్రభుత్వం గొర్రెలకు, మేకలకు ఉచితంగా అందిస్తున్న నట్టలనివారణ మందులను గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఉప సంచాలకులు డాక్టర్ చందక నరసింహులు అన్నారు. మండలంలోని చిట్టివలస, గంగరాం పంచాయతీల్లో ఉచితంగా సన్న జీవాలల నట్టల నిర్మూలన మందులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని మొత్తం 69,868 సన్నజీవాలు లక్ష్యం కాగా.. ఇప్పటివరకు సుమారు 14 వేలు పైచిలుకు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ మందా లోకనాథం, పశు వైద్యులు డా.కిరణ్ కుమార్ లఖినేని, పశువైద్య సహాయకులు వెంకటేష్, తరుణమ్మలు, సత్యరాజ్ కుమార్, గణపతి పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో గుత్తావల్లి పిహెచ్‌సి పరిధిలో ఉన్న టిడిఆర్ రాజపేటలో గుత్తావల్లి వైద్యాధికారి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే తోటపల్లి గ్రామంలో పాలకొండ శ్రీ విజయ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండి దూబ పద్మావతి ఆధ్వర్యంలో డాక్టర్ సాయి శంకర్ 53 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి రక్త నమోనాల సేకరించారు. కార్యక్రమంలో గుత్తావల్లి వైద్యాధికారులతో పాటు ఎంఎల్‌హెచ్‌పి నవీన, ఎఎన్‌ఎం రమాదేవి, హెల్త్ అసిస్టెంట్ మజ్జి వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు సతీష్‌కుమార్

అనుబంధ కమిటీలతో ఆరంభం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. కవిటి మండల టిడిపి అధ్యక్షుడు పొందల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల అనుబంధ సంస్థల కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిశీలకుడు పీరుకట్ల విఠల్‌రావు, ఇచ్ఛాపురం రూరల్ పరిశీలకుడు లోడగల కామేష్, కంచిలి పరిశీలకుడు దాసరి తాతారావు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన కీలక సూచనలు చేశారు. జులై 2 నుంచి ప్రారంభమయ్యే 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


విఠల్‌రావును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అనంతరం విఠల్‌రావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మణిచంద్ర ప్రకాష్, బెందాళం రమేష్, దక్కత ఢిల్లీరావు, మాదిన రామారావు, పత్రి తవిటయ్య, లోపింటి పద్మనాభం, వాసుదేవ ప్రధాన్, ఇతర యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం

లావేరు: మత్తు పదార్థాలతో భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని యువతకు చైతన్యం కల్పిస్తూ బుడుమూరులో ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, గంజాయి రహిత జిల్లా నోడల్ అధికారి పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో పాఠశాల ఈగల్ క్లబ్ శనివారం ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వలన కలిగే నష్టలను వివరిస్తూ, నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు, యువత క్రమశిక్షణ కలిగి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నల్లి లక్ష్మునాయుడు, మాజీ ఎంపిటిసి పండి గోపాలరావు, హెచ్‌ఎం రువ్వ పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, ఎం.అనురాధ, కె.వెంకటరావు, పడాల తమ్మినాయుడు, కూన చినపెంటయ్య, సీర రమేష్ బాబు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, సభ్యులు, యువత పాల్గొన్నారు. వారిచే మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ నివారణ, సహాయం కొరకు 1972 నంబర్‌కు ఫోన్ చేయాలని గోవిందరావు కోరారు.

'తల్లికి వందనం'పై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పలాస

తల్లికి వందనం పథకంపై విద్యార్థుల చదువుకు ప్రభుత్వం రూ.13 వేలు ఆర్థికసాయం ఇటీవల అందజేసింది. ఈ నేపథ్యంలో ఈ పథకంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నుంచి స్పందన తెలుసుకునేందుకు శనివారం కాశీబుగ్గ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 30 మంది పాల్గొన్నారు. వ్యాసరచన పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఆర్.సిహెచ్.లావణ్య (కాశీబుగ్గ జెడ్పిహెచ్ఎన్), బి.కార్తీక (కాశీబుగ్గ జెడ్‌పిహెచ్‌ఎన్), వక్తృత్వ పోటీలో ప్రథమ స్థానంలో టి.సవ్యక్ష (కాశీబుగ్గ జెడ్‌పిహెచ్‌ఎన్), ద్వితీయ స్థానంలో పి.రమ్య(జెడ్‌పిహెచ్‌ఎన్, బ్రాహ్మణతర్లా) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 సిహెచ్.సత్యం, పాఠశాల హెచ్‌ఎం పి.లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు


సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మాజీ మంత్రికి సన్మానం

ప్రజాశక్తి- పలాస

నూతనంగా ఎంపిక చేసిన వైసిపి కమిటీ సభ్యులు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు శనివారం ఆయన నివాసంలో కలిసి ధన్యవాదంలు తెలిపారు. వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆదేశాలు మేరకు పలాస నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాలిటీకు పార్టీ కమిటీలను నియమించారు. ఇందులో పలాస మండల కమిటీలో వైఎస్ ప్రెసిడెంట్లుగా రౌతు శంకరరావు, బొడ్డు సుధాకర్, జనరల్ సెక్రటరీలుగా పోతనపల్లి మాధవరావు, కొర్ల సంతోష్, గొండు మోహనరావు, కొర్ల మురళీకృష్ణ, కార్యదర్శులుగా శిష్టు తేజ, వంకల షణ్ముఖరావు, ఖగేష్ దొర, బొడసింగి ధనుంజయలను నియమించారు. వీరి నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి అప్పలరాజులకు ధన్యవాదాలు తెలిపారు. నూతన కమిటీలకు అప్పలరాజు శుభాకాంక్షలు తెలిపారు.

పి.వి నరసింహారావుకు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్వర్గీయ మాజీ ప్రధాని పి.వి నరసింహరావు జయంతిని నగరంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శనివారం నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌ఛార్జి గాదం వెంకట త్రినాథరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పి.వి.నరసింహరావు లాంటి గొప్ప మేధావి అందులో మన తెలుగువాడు కావటం మనందరికీ గర్వకారణమని కొనియాడారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశాన్ని గొప్ప స్థాయిలో నిలబెట్టిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కెవిఎల్ఎస్ ఈశ్వరి, నాయకులు మామిడి సత్యనారాయణ, బొచ్చ వెంకటరమణ, ఆబోతుల వెంకట నాయుడు, తెంబూరు మధుసూదనరావు పాల్గొన్నారు.


పి.వి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

లావేరు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటాపురం సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు అన్నారు. శనివారం వెంకటాపురం జెడ్‌పి పాఠశాలలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లును సర్పంచ్ ఎల్లంనాయుడు చేతులమీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నతి శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎస్ఎంసి చైర్మన్ సనపతి నీలవేణి, హెచ్‌ఎం బెహరా భాస్కరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యామిత్ర కిట్లు అందజేస్తున్న సర్పంచ్ ఎల్లంనాయుడు తదితరులు